RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

పత్తి మద్దతు ధరలపై మండిపడ్డ హరీష్ రావు

హైదరాబాద్, అక్టోబర్ 17 (ప్రభాత సూర్యుడు): తెలంగాణ రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పత్తికి కేంద్రం చెల్లించే మద్దతు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోవిధంగా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. ఒకే దేశం-ఒకే పన్ను, ఒకే దేశం- ఒకే ఎన్నిక, ఒకే దేశం- ఒకే రేషన్ అంటూ ఊదరగొట్టే కేంద్ర ప్రభుత్వం.. ఒకే దేశం- ఒకే కనీస మద్దతు ధర ఎందుకు ఇవ్వడం లేదు. నాణ్యమైన పత్తిని పండిస్తున్న తెలంగాణ రైతు పట్ల ఎందుకీ వివక్ష? గుజరాత్ పత్తికి మద్దతు ధరగా క్వింటాకు రూ.8,257 చెల్లిస్తున్న కేంద్రం.. తెలంగాణకు రూ.7,521 మాత్రమే ఇవ్వడం దుర్మార్గం. గుజరాత్‌కు ఒక నీతి, తెలంగాణకు ఒక నీతా? అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలి!



తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేరుస్తామని అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందుకు తగ్గట్లుగా అడుగులు వేయాలి. నీళ్లు, నిధులు,నియామకాలు అన్న ఆకాంక్షలు త్వరగా నెరవేర్చాలి. ఇదే సందర్భంలో ఇక ఉచిత పథకాలను దరిచేరకుండా పటిష్టమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించుకోవాలి. రైతుబంధు, రైతు రుణమాఫీలు,రూపాయికి కిలోబియ్యం, ఆరోగ్యశ్రీ వంటి పథకాలకు చెక్ పెట్టాలి. పంటలను పూర్తి స్థాయిలో గిట్టుబాటు ధరలకు కొనడమే రైతులను ఆదుకోవడం అవుతుంది. వారికి సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడం, పంటరుణాలను అందించడం,నీట వసతి కల్పించడం ప్రధాన ఎజెండా కావాలి. ఇవన్నీ కల్పించి పండించిన పంటలను సకాలంలో కొనుగోలు చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ప్రకృతి వైపరీత్యాల్లో ఆదుకునేలా ఉండాలి. చిన్ననీటి వనరులను అభివృద్ధి చేయాలి. ఇలా చేస్తే వ్యవసాయంతో పాటు, అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఇవి చేయకుండా నేలవిడిచి సాము చేయడం సరికాదు. అలాగే విద్యావైద్య రంగాలను కూడా గ్రామస్థాయి లో పటిష్టం చేయాలి. సాగు,తాగునీటి వనరులతో పాటు, పంటలు పండే భూములకు ఇక్కడ కొదువలేదు. పనిచేయడానికి జనం ఉన్నారు. వీటి ఎలా ఉపయోగించాలన్నది నేతల సమర్థత మీద ఆధారపడి ఉంది. పథకాలు, పందేరాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుని వెళ్లడం అసాధ్యం అని గుర్తించాలి. అలాగే గత కెసిఆర్ ప్రభుత్వంలా అభూతకల్పనలు,భ్రమలు కల్పించడం మానుకోవాలి.అప్పుడే గ్రామాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయి. పంచాయితీలను పటిష్టం చేసి వాటి ద్వారానే గ్రామాల పురోభివృద్దికి పాటుపడాలి. రాజ్యాంగం ఇచ్చి అధికారాలను పంచాయితీలకు దఖలు పర్చాలి. తెలంగాణ ప్రజల బతుకులు మారాలన్న ఏకైక లక్ష్యంతో పోరాటం చేసి సాకారం చేసుకున్న ప్రత్యేక తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తి అయ్యాయి. నిజానికి ఇలాంటి చిన్న రాష్ట్రంలో అన్ని వనరులు ఉన్నా ప్రజల ఆకాంక్షలు తీరలేదు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పదేళ్లు కల్వంకుంట్ల కుటుంబం రాజభోగాలు అనుభవించింది. గడీల పాలన అందించింది. దీనిని నిందిస్తూ కాలయాపన చేయకుండా రేవంత్ సర్కార్ ముందుకు సాగాలి. అలాగే ఈ పదేళ్లలో తెలంగాణలో ఎవరి బతుకులు మారాయన్నది గమనిస్తే.. రాజకీయ పార్టీల్లో కొందరి బతుకులు మారాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంతో ప్రజల బతుకులు అలాగే ఉన్నాయి. ఈ క్రమంలో పదేళ్ల పాలనపైనా, ప్రజల జీవన చిత్రంపైనా చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. రేవంత్ ప్రభుత్వం గత విధ్వంసాలను గుర్తించి ముందుకు సాగాలి. ప్రజలు ఏం కోరుకుంటున్నారో చర్చించాలి. మూసపద్దతిలో కాకుండా నిర్మాణాత్మక వైఖరితో ముందుకు సాగితే సింగపూర్, మలేషియా లాంటి చిన్నచిన్న దేశాలను అధిగమించవచ్చు. నీళ్లు, నిధులు,నియామకాలు అన్న నినాదంలో ఏవీ సాకారం కాలేదు. గత ప్రభుత్వ తప్పిదాలను సమీక్షించుకుని ప్రజలు కోరుకుంటున్న విధంగా పాలన సాగించాలే కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేయాలి. లేకుంటే..రాజకీయాల్లో ప్రజలు తమదైన రీతిలో బుద్ది చెబుతారని గుర్తించాలి. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తరవాత తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటు లోనూ.. పథకాలను అమలు చేయడంలోనూ.. అంతకు మించిన స్వార్థ ప్రణాళికతో కెసిఆర్ తొమ్మిదిన్నరేళ్లు పాలించారు. అందుకే ఆయన రాజకీయ జీవితం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా అప్రతిహతంగా కొనసాగింది. కానీ ప్రజలనే వారు ఎల్లవేళలా దేగకళ్లు పెట్టుకుని చూస్తుంటారని గమనించలేదు. ఇవాళ తెలంగాణ అమరవీరుల కోసం కన్నీరు కారుస్తానంటే ప్రజలు నమ్మరు. తవ్వినకొద్దీ అవినీతి పుట్టలు బయటపడుతున్నాయి. ఒక్కో పథకం తవ్వేకొద్దీ అవినీతే తప్ప ప్రజలకు మేలు చేసిన ఆనవాళ్లు కానరావడం లేదు. కాళేశ్వరంతో పాటు అనేక ప్రాజెక్టులను కట్టినట్లు చెప్పి అవినీతిని పారించారు. చెరువులను పునరుద్దరించి గొలుసుకట్టు చెరువులకు ప్రాణం పోసామని డొల్ల మాటలు ప్రచారం చేశారు. మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీరు సరఫరా చేసామని బుకాయించారు. హరితహారంతో పచ్చదనాన్ని పెంచామని చెప్పి పచ్చి అబద్దాలు చెప్పారు. అన్ని పథకాల్లో అవినీతి దాగివుందన్న సత్యం బయటకు రావడంతో ప్రజలతో పాటు ప్రపంచం కూడా విస్తుపోయింది.ప్రజలకు ఆదర్శ నేతగా నిలవాల్సిన కెసిఆర్ కేవలం తన కుటుంబం, తన బంధువుల కోసం స్వార్థ రాజకీయాలు చేసారని చెప్పడంలో సందేహం లేదు. ఓ రకంగా చెప్పాలంటే పదేళ్ల కెసిఆర్ పాలన అంతా గోబెల్స్ ప్రచారంతో సాగింది. ఇప్పుడు అధికారం కోల్పోవడంతో అదే పనిలో బిఆర్ఎస్ నేతలు ఉన్నారు. నిత్యం ఏదో ఒక ఆరోపణతో తమ గత పాపాలను బయటకు రాకుండా చూస్తున్నారు.తెలంగాణలో కెసిఆర్‌ను మించిన విజనరీ నేత లేదని అప్పుడూ, ఇప్పుడూ భ్రమింప చేస్తున్నారు. కరిమింగిన వెలగ పండులా ఆయన విజనరీ అంతా లోపాలపుట్ట అని తేలింది. అనేక ఆశలు,ఆశయాలతో, అమరుల త్యాగాల తో పురుడుపోసుకున్న తెలంగాణను అభివృద్ధిపథంలో తీసుకెళ్లేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నా, స్వార్థమనే పథకంలో కొట్టుకు పోయాయి. ఈ క్రమంలో పదినెలల రేవంత్ ప్రభుత్వం ఆర్భాటాలకు, అనవసర ఖర్చుల కు, ఉచిత పథకాల జోలికి పోకుండా క్షేత్రస్థాయిలో సమస్యలపై దృష్టి సారించాలి. తెలంగాణ అభివృద్ధిని మళ్లీ పట్టాలకు ఎక్కించాలి. తాము ఇచ్చిన గ్యారెంటీల పేరుతో కాలక్షేపం చేయకుండా గ్రామస్థాయిలో సమస్యలను ఆకళింపు చేసుకోవాలి. గ్రామాలను బలోపేతం చేసి అభివృద్ధి చేయాలి. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవ నినాదాలతో సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చామన్న ఘనత సాధించాలి. ఉద్యోగాల కల్పన, గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంచడం, వ్యవసాయాన్ని బలోపతేం చేయడం వంటి కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగించాలి.

దేశం గర్వించదగ్గ గిరిజన వీరుడు

కుమ్రం భీం 84వ వర్ధంతికి కెటిఆర్ నివాళి

హైదరాబాద్, అక్టోబర్ 17 (ప్రభాత సూర్యుడు): దేశం గర్వించ దగ్గ గిరిజన తిరుగుబాటు వీరుడు, గోండు బెబ్బులి కుమ్రం భీం 84వ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆదివాసీ యోధుడు, అరణ్య సూర్యుడు, పోరాటాల పోతుగడ్డ మీద పుట్టిన అడవి తల్లి ముద్దుబిడ్డ అని చెప్పారు. ఉద్యమ బాటలో, ఉజ్వల ప్రగతి దారిలో జల్.. జంగల్.. జమీన్ నినాదమే స్ఫూర్తిగా కొమురం భీం ఆశయాల అడుగు జాడల్లో పయనించామని తెలిపారు. కొండల్లో కోనల్లో వున్న ప్రతి గూడేనికి, తండాకు స్వచ్ఛమైన మంచినీళ్ల సరఫరాతో విష జ్వరాల చావుల నుంచి విముక్తి కల్పించామని వెల్లడించారు. 4 లక్షల ఎకరాలకుపైగా పోడు భూములపై హక్కులు కల్పిస్తూ.. అడవి బిడ్డలకు పట్టాభిషేకం చేశామని గుర్తుచేశారు. మావనాటే మావరాజ్.. 'మా గూడెంలో మా తండాలో మా రాజ్యం' ఆకాంక్ష స్వరాష్ట్రంలో నెరవేరిందని చెప్పారు. 2,471 గిరిజన పంచాయతీల్లో స్వయం పాలనా జెండా ఎగిరిందని అన్నారు. అవకాశాల్లో జనాభా దామాషా ప్రకారం సముచిత వాటా దక్కేలా గిరిజన రిజర్వేషన్లను 10 శాతానికి పెంచుతూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. 188 గురుకుల పాఠశాలలు, 125 గురుకుల ఇంటర్ కాలేజీలు, 22 గురుకుల డిగ్రీ కళాశాలలతో అడవి బిడ్డల విద్యా వికాసానికి నిబద్ధతతో కృషి చేశామని పేర్కొన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ తో విదేశీ చదువుల కలలు సాకారం, గిరిజన యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దిన సీఎంఎస్టీఈఐ స్కీం, ఆ మహనీయుని పేరుతో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాను ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున నిర్మించిన కుమరం భీం ఆదివాసీ భవన్, సేవాలాల్ బంజారా భవన్లు గిరిజన అస్తిత్వానికి ప్రతీకలుగా నిలిచాయని తెలిపారు. గిరిజన సంస్కృతికి గొప్ప గౌరవమైన సమ్మక్క సారక్క జాతర, నాగోబా, జంగుబాయి, చెంచుల బౌలాపూర్, ఎరుకల నాంచారమ్మ, గాంధారి మైసమ్మ, కొలాం పండుగలకు భారీగా నిధులు విడుదల చేశామని, అధికారికంగా నిర్వహించామని వెల్లడించారు. అస్తిత్వ ఉద్యమాలకు, ఆత్మగౌరవ పోరాటాలకు నిత్య ప్రేరణ అందించే రణధీరుడు కుమ్రం భీంకు ఎక్స్ వేదికగా జోహార్లు అర్పించారు.

టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోత

మెటాలో భారీగా ఉద్యోగుల తొలగింపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 17 (ప్రభాత సూర్యుడు): టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోత కొనసాగుతూనే ఉంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ మెటా మరింతమంది ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైంది. దీర్ఘకాలిక వ్యూహాత్మక లక్ష్యాల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. లేఆఫ్‌ల విషయాన్ని కంపెనీ ధ్రువీకరించినప్పటికీ ఎంత సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తుందనే సమాచారాన్ని మాత్రం వెల్లడించలేదు. మెటా పరిధిలో ఉన్న వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, వర్చువల్ రియాలిటీపై పనిచేస్తున్న రియాలిటీ ల్యాబ్.. ఇలా అన్ని వ్యాపారాల్లో ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోనున్నట్లు తెలుస్తోంది. రిక్రూటింగ్, లీగల్ ఆపరేషన్, డిజైన్... వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై ఈ ప్రభావం పడనుంది. దీర్ఘకాలిక వ్యూహాత్మక లక్ష్యాలు, ప్రాంతీయ వ్యూహాల్లో మార్పులు చేస్తున్నామని మెటా అధికారిక ప్రతినిధి తెలిపారు. అందులోభాగంగానే ఈ తొలగింపులు చేపడుతున్నట్లు వెల్లడించారు. అయితే మెటా నుంచి ఉద్వాసన పలికిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ అవకాశాలు అందించేందుకు కంపెనీ ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2022లో మెటా ఏకంగా 11వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. గతేడాదిలో మరో 10వేల మందిని ఇంటికి పంపింది. తాజాగా మరో రౌండ్ లేఆఫ్‌లకు సిద్ధమైంది. అయితే ఈసారి తొలగింపులు తక్కువ సంఖ్యలోనే ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే మెటా నుంచి లేఆఫ్‌కు గురైనట్లు కొందరు ఉద్యోగులు సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు పెడుతున్నారు. ఇదిలాఉండగా.. టెక్ కంపెనీలు ఆర్థిక ఒత్తిళ్లు, సైబర్ సెక్యూరిటీపై పెట్టుబడులు, ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవడం కోసం పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. ఇక ఖర్చుల్ని తగ్గించుకొనే ప్రయత్నంలో భాగంగా ఉద్యోగులను తొలగిస్తున్నారు. ఇప్పటికే ఇంటెల్ (ఎనిబి), సిస్కో (అతిబఇనీ), ఐబీఐ కంపెనీలు పెద్ద ఎత్తున ఉద్యోగులకు ఉద్వాసన పలికాయి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటెల్ ఏకంగా 15శాతం మంది ఉద్యోగులను తగ్గించుకుంది. ఇలా ఈ ఏడాది ఆగస్టు నాటికి 422 కంపెనీలు ఏకంగా 1,36,000 మందిని తొలగించాయి.

కారు ప్రమాదంలో మరణించిన వ్యక్తికి

నివాళులు తెలిపిన మట్టా దయానంద్

కల్లూరు - ప్రభాత సూర్యుడు మండల పరిధి పేరువంచ గ్రామ పంచాయితీ ఎన్టీఆర్ కాలనీ లో నిన్న రాత్రి జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందిన మంచాల చిన్న నర్సయ్య పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్.అనంతరం ఆ కారు ప్రమాదంలో గాయపడిన మిగతా వారిని పరామర్శించారు. అలాగే మెరుగైన వైద్యం కోసం ఖమ్మం వెళ్లిన మంచాల నర్సమ్మ ఆరోగ్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మరణించిన చిన్న నర్సయ్య కుటుంబం తో మాట్లాడి మనోధైర్యం నింపారు . ఈ కార్యక్రమంలో కల్లూరు మండల కాంగ్రెస్ నాయకులు, పేరువంచ గ్రామ పంచాయతీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయినను పోయిరావలెను హస్తినకు

రేవంత్ ఢిల్లీ పర్యటనలపై కెటిఆర్ సెటైర్లు

హైదరాబాద్, అక్టోబర్ 17 (ప్రభాత సూర్యుడు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా కామెంట్స్ చేశారు. పైసా పనిలేదు-రాష్ట్రానికి రూపాయి లాభం లేదు.. 10నెలలు - 25 సార్లు - 50 రోజులు.. పోను 25 సార్లు, రాను 25 సార్లు, నీ ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేసి సిల్వర్ జూబ్లీ కూడా చేస్తివి. తట్టా మట్టి తీసింది లేదు.. కొత్తగా చేసింది అసలే లేదు.. అయినను పోయి రావాలె హస్తినకు.. అంటూ ఎద్దేవా చేశారు. అన్నదాతల అరిగోసలు.. గాల్లో దీపాల్లా గురుకులాలు.. కుంటుపడ్డ వైద్యం.. గాడి తప్పిన విద్యా వ్యవస్థ.. అయినను పోయి రావాలె హస్తినకు.. మూసి పేరుతో - హైడ్రా పేరుతో పేదోళ్ల పొట్టలు కొట్టి - 420 హామీలను మడతపెట్టి మూలకు వేసి.. అయినను పోయి రావాలె హస్తినకు.. పండగలు పండగళ్లా లేవు.. ఆడబిడ్డల చీరలు అందనేలేవు.. అవ్వా తాతలు అనుకున్న పింఛను లేదు.. తులం బంగారం జాడనే లేదు.. స్కూటీలు లేవు.. కుట్టు మిషిన్లు లేవు.. అయినను పోయి రావాలె హస్తినకు' అంటూ కేటీఆర్ విమర్శలు చేశారు. కాగా పేదల ఇళ్లు కూల్చి.. బిల్డర్లు, వ్యాపారవేత్తలను భయపెట్టి డబ్బు వసూళ్ల కోసమే రేవంత్ సర్కార్ హైడ్రా తెచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. పేదలకు తాము అండగా ఉంటామని, క్షేత్రస్థాయిలో పర్యటించి.. బస్తీలు, కాలనీల్లోని వారి భరోసా కల్పిస్తామన్నారు. ఊష్ట్రం దివాలా తీసిందని ప్రచారం చేస్తూ.. తెలంగాణ పట్ల అందరూ నమ్మకం కోల్పోయేలా.. రేవంత్‌రెడ్డి అసమర్థ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. దిక్కుమాలిన పాలనవల్ల హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పడిపోయిందన్నారు. లక్షన్నర కోట్లతో చేపడుతున్న మూసీ సుందరీకరణ వెనుక భారీ కుంభకోణం ఉందని, దానికోసం నిధులు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు.

రాజిని శివ భార్గవి అనే గిరిజన విద్యార్థినికి ఉన్నత చదువులకు సత్తుపల్లి ఎమ్మెల్యే భరోసా

సత్తుపల్లి -ప్రభాత సూర్యుడు సత్తుపల్లి పట్టణంగుడిపాడు కు చెందిన నాయకపోడు గిరిజన కులానికి చెందిన రాజిని ప్రసాదు-నాగమణి దంపతుల కుమార్తె శివ భార్గవి ఇటీవల నీట్ లో సీటు సంపాదించింది. ఈ సందర్భంగా నిరుపేదలైన వారి కుటుంబం యం.బి.బి.యస్ చదవడానికి అయ్యే ఖర్చు కోసం పత్రికలను ఆశ్రయించగా అమెరికాలోని నివసిస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు కుమారుడు చల్లగుళ్ళ నిఖిల్ దంపతులు ఆ విద్యార్థినికి 20వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ , రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది.ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఆ విద్యార్థిని చదువు పూర్తయ్యే వరకు ప్రభుత్వం తరుపున మా వంతు ఎలాంటి సహాయం అయినా మా తరుపున చేస్తామని ప్రకటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేతిపంపు మరమ్మత్తుల నిమిత్తము తీశారు.. తిరిగి బిగించడం మరిచారు

కల్లూరు - ప్రభాత సూర్యుడు పేరువంచ గ్రామ పంచాయితీ లో గల ఎన్టీఆర్ కాలనీ లో కొండ నాలుకకు మందు వేస్తె ఉన్న నాలుక ఊడినట్టు సామెత లాగా అయ్యింది ఎన్టీఆర్ కాలనీ త్రాగు నీటి బోర్ల సంగతి. వివరాల లోకి వెళితే మండలం లో అతి పెద్ద పంచాయితీ లలో పేరువంచ గ్రామ పంచాయితీ ఒకటి ఈ పంచాయితీ లో సుమారుగా 2300 ఓట్ల జనాభా కలిగిన పంచాయితీ లలో ఒకటి. గతంలో ఎన్టీఆర్ కాలనీ కి ఆర్ అండ్ బి రోడ్డు పక్కనే త్రాగు మరియు వాడుక నీటికోసం వేయించనా మోటార్ తో ఐదు సంవత్సరాలు చిన్న చిన్న ఇబ్బందులు వచ్చినా అప్పటి పాలక వర్గం రిపేర్లు చేపించి నీటి ఏద్దడి లేకుండా చెయ్యడం జరిగింది. ఆ తరువాత మిషన్ భగీరథ వచ్చిన తరువాత అట్టి బోర్లు మరియు మోటార్లు మరుగున పడిపోయాయి. ఇప్పుడు ఆ మిషన్ భగీరథ నీటి విడుదల కూడా అంతంత మాత్రము గానే ఉన్నాయి అనీ ఎంపీడీఓ కి గతంలో పిర్యాదు చెయ్యగా అప్పుడు పంచాయితీ కార్యదర్శి మరియు పంచాయితీ సిబ్బంది మరియు ఎన్టీఆర్ కాలనీ వారు కలిసి ది 19.04.2024 న బోర్ ని బయటకు తీసి రిపేరు నిమిత్తము తీసుకోని వెళ్లారు. అప్పటి నుండి ఈ రోజు వరకు ఆ బోర్ లేదు అది ఆలా వదిలేసారు. అలాగే ఇటీవల పంచాయితీ కార్యలయం లో జరిగిన గ్రామ సభ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పనులు గుర్తింపు ప్రణాళిక తయారు చేయుటకు మరియు ఆమోదించుటకులి అనే కార్యక్రమం లో గ్రామ పంచాయతీ స్పెషల్ అధికారి కి ఎన్టీఆర్ కాలనీ లో త్రాగు నీటి కి ఇబ్బంది అవుతుంది అక్కడ ఉన్న అంగన్వాడీ సెంటర్ లో నీరు కాలనీ వాళ్ళు తాగుతున్నారు ఆ నీటి లో ఫ్లోరైడ్ ఉన్నది అనే అభియోగం తో ప్రజలు ఇబ్బందులు కి గురి అవుతున్న సమాచారం మేరాకు కొత్త చేతి పంపు మంజూరు కి మరియు ఆర్ అండ్ బి రోడ్డు పక్కన కరెంట్ మోటార్ ని ఫ్లష్ చేసి గతంలో రిపేరు నిమిత్తం తీసిన కరెంట్ మోటర్ ని బిగించి యధావిధిగా నీటిని అందించే విధంగా మరియు అదే ఆర్ అండ్ బి రోడ్డు పక్కన ఉన్న చేతి పంపు రిపేర్ చేయించాలి అని పిర్యాదు చెయ్యగా వారు అదే విష్యాలు ఆ రోజు గ్రామ సభలో రికార్డ్ లో రాసుకోవడం జరిగింది.అలాగే కొన్ని సార్లు పదే పదే అడగంగా గ్రామ కార్యదర్శి పంచాయితీ సిబ్బంది ని మరియు బోర్ మెకానిక్ ని పంపించి కాలనీ వాసుల సహకారం తో చేతి పంపుని ది 17-10-2024 వెలికి తీసి పక్కన భద్ర పరిచి వెళ్లారు రోజులు గడుస్తున్న అట్టి పనులకు కార్యాచరణ లేకపోవడం విశేషం. దయచేసి ఇప్పటికి ఐనా గ్రామ పంచాయితీ స్పెషల్ అధికారి మరియు పంచాయితీ కార్యదర్శి స్పందించి ఎన్టీఆర్ కాలనీ లో మరమ్మత్తులకు బయటకు తీసిన బోర్లు రిపేర్ చేసించి మళ్ళీ బోర్లను వాడుకలోకి తీసుకోని రావాలి అని త్రాగు మరియు వాడుక నీటి ని అందించే విధంగా అధికారులు ని కాలనీ వాసులు కోరుకుంటున్నారు.